“అలాగే సార్ .... థాంక్యూ సార్” బుచ్చిబాబు వెనక్కి తిరిగాడు.

“ఆగవోయ్”

బుచ్చిబాబు ఆగి వెనక్కి తిరిగాడు.

“మీ ఫ్రెండ్ స్టేట్స్ నుండి మంచి సెంట్లు తెచ్చి నీకిస్తే అవి తెచ్చి నాకివ్వు” ఇకిలిస్తూ అన్నాడు ఏకాంబరం.

“అలాగే సార్” అన్నాడు బుచ్చిబాబు .

మనసులో మాత్రం “ఓరి ముసలి లబ్బీలగబ్బా .. నీకు సెంట్లూ స్ప్రేలు కావాల్సి వచ్చాయా? నేనింకా నా సీతకి ఇద్దామని అనుకున్నానే” అని కసిగా తిట్టుకున్నాడు.

0 0 0

బుచ్చిబాబు చాలా ఆలోచనలో పడిపోయాడు. మద్రాసు ఫ్లయిట్ వచ్చింది. పాసింజర్లు అందరూ వెళ్ళిపోయారు. కానీ సుందర్ ఆ వచ్చిన వాళ్ళలో ఎక్కడా కనపడలేదు.

సుందర్ రాలేదా? హైదరాబాదు ప్రయాణం పోస్టుపోను చేసుకున్నాడా? పోనీ లీవ్ కాన్సిల్ చేస్కుని ఇటునుండి ఇటే ఆఫీసుకి వెళిపోతేనో?

ఇలా ఆలోచిస్తున్న బుచ్చిబాబు భుజంమీద ఓ చెయ్యి బరువుగా పడింది. బుచ్చిబాబు ప్రక్కకి తిరిగి చూశాడు.

అతను పూలపూల షర్టుతో, పొడవయిన జుత్తుని వెనక్కి గట్టిగా దువ్వి రబ్బరుబ్యాండు పెట్టి పోనీటెయిల్ వేసుకుని వున్నాడు. కళ్ళకి రేబాన్ గ్లాసెస్ పెట్టుకుని వున్నాడు. ప్యాంట్ మోకాళ్ళకి క్రిందగా, కాళ్ళ మడమలకి కాస్త పైకివుంది.

బుచ్చిబాబుని చూస్తూ చాలా పరిచయస్తుడిని చూసినట్లు నవ్వుతున్నాడు.

“ఎవరండీ మీరూ?” అయోమయంగా అడిగాడు బుచ్చిబాబు.

“ఓ....కమాన్....నోజోక్స్” అంటూ బుచ్చిబాబు వీపులో గట్టిగా గుద్దాడు.

ఆ దెబ్బకి కాస్త మూలిగాడు.

“సారీ సార్..... నేను మిమ్మల్ని గుర్తు పట్టలేదు” అన్నాడు బుచ్చిబాబు ‘ఎవడ్రా వీడు ఇంత గుద్దు గుద్దాడు’ అని మనసులో తిట్టుకుంటూ.

“హ్హాహ్హాహ్హా...ఆర్ యూ జోకింగ్...ఆర్ యాక్టింగ్?” అంటూ మరో పిడిగుద్దు బుచ్చిబాబు భుజం మీద గుద్దాడు.

బుచ్చిబాబు మళ్ళీ బాధగా మూలిగాడు. ఈసారి అతనికి చాలా కోపంవచ్చింది.

“ఏంటండీ మీరు మంచీ మర్యాద లేకుండా? మీరెవరో కూడా నాకు తెలియదు. సిల్లీగా?” అన్నాడు చికాకుగా మొహంపెట్టి.

అతను బుచ్చిబాబు వంక ఆశ్చర్యంగా చూశాడు.

"ఓ! అయితే నువ్వు నన్ను నిజంగా గుర్తుపట్టలేదు. వెరీ స్ట్రేంజ్ నేను బుష్షిబాబు....షుండర్ .... షుండర్! నీయొక్క స్నేహితుడు" అన్నాడు.

బుచ్చిబాబు అదిరిపడ్డాడు.

సుందరా?

ఒక నిమిషంపాటు చాలా పరిశీలనగా మొహంలో మొహంపెట్టి చూసిన తరువాత అతనిలో సుందర్ పోలికలు కనిపించాయి బుచ్చిబాబుకి.

"ఒరేయ్ సుందర్" బుచ్చిబాబు ఆనందంగా అరుస్తూ సుందర్‌ని కౌగలించుకున్నాడు.

సుందర్ కూడా "ఒరేయ్ బుష్షి" అని రెండుచేతులతో బుచ్చిబాబుని చుట్టేస్తూ వీపులో ఓ గుద్దు గుద్దాడు. బుచ్చిబాబు బాధగా మూలిగి అతన్ని వదిలేసాడు.

"నీకు ఇదివరకటికన్నా కాస్త యాక్టివ్‌నెస్ పెరిగింది సిల్లీగా" చెయ్యి వెనక్కి పెట్టి వీపు తడుముకుంటూ అన్నాడు బుచ్చిబాబు.

"ఓ .... య్యా! నేను కొంచెం యాక్టివ్" అన్నాడు సుందర్ భుజాలెగరేస్తూ.

బుచ్చిబాబు అతనికి కాస్త దూరంగా జరిగాడు.

"నీ భాషా, రూపం అన్నీ మారిపోయాయే?"

"య్యా.....షానారోజులు అమెరికాలో వున్నాను కదా?"

పుట్టినప్పటినుండి ఇరవై ఏళ్ళకు పైగా ఇండియాలో అదీ ఆంధ్రరాష్ట్రంలో వుంటే ఏమీలేదుగానీ మూడు సంవత్సరాలు అమెరికాలోవుంటే ఇంతగా మారిపోవాలా? అని మనసులో అనుకున్నాడు బుచ్చిబాబు.

"నేను ఇచట రెండు రోజులు నీతో స్పెండ్ షేషి పోదామని వష్షినాన్. హైదరాబాదులో ఏదైయినా మంషి హోటల్‌కి టిస్కెల్లి నన్నుదింపు" అన్నాడు సుందర్ కుడిచేయి వెనక్కిపెట్టి పోనీటేయిల్‌ని ఎగరేస్తూ.

"భలేవాడివే....నేనిక్కడ వుండగా నిన్ను హోటల్‌లో ఎలా దిగనిస్తాను? మా ఇంటికే పోదాం పద?"

"అమెరికాలో అయినా ఎవరికి ఇబ్బంది కలిగించరాదు. అటుల ఇబ్బంది కలుగచేసిన యడల షూట్ చేయుదురు".

"కానీ నువ్వు మా ఇంటికి రావడము వల్ల మాకు ఆనందమేగాని యిబ్బందిలేదు. అందుచేత మేము నిన్ను షూట్ చెయ్యము. ఒకవేళ నిన్ను షూట్ చేయాలన్నా మా దగ్గర రివాల్వర్ లేదు" అన్నాడు బుచ్చిబాబు .

"హ్హా హ్హా హ్హా.....గుడ్ జోక్" అంటూ పిడికిలి బిగించి బుచ్చిబాబు వెన్నులో ఓ గుద్దు గుద్దబోయాడు సుందర్.

కాని అతి చాకవక్యంగా తప్పించుకుని "హమ్మ....ఆశా?" అన్నాడు.

సుందర్ ఫకాల్మని నవ్వేశాడు.

బుచ్చిబాబు క్రిందవున్న సుందర్ సూట్‌కేసుని అందుకుని ఆక్కడే వున్న ఓ టాక్సీవాడికి తన ఇంటి ఏరియా చెప్పి "వస్తావా?" అని అడిగాడు.

"రాను" అన్నాడు వాడు.

"అదే అమెరికాలో ఇటుల సమాధానం షెప్పిన యడల షూట్ చేయుదురు" ప్రక్కనున్న వేరే టాక్సీవాడి దగ్గరికి వెళ్ళుతూ అన్నాడు సుందర్.

"అలా....ఇక్కడకూడా వుంటే బాగుణ్ణు" అన్నాడు బుచ్చిబాబు

రెండో టాక్సివాడు వస్తానని అన్నాడుగాని రెండొందలు అడిగాడు.

"ఓ......వెర్రి చీఫ్...రెండొందలు అనగా ఓన్లీ సిక్స్ డాలర్ అమెరికాలో అయితే మేము సిక్స్ డాలర్స్ టిప్ యిచ్చెదము. లేని ఎడల డ్రయివర్ మమ్మల్ని షూట్ చేయును" అన్నాడు సుందర్ భుజాలు ఎగరవేస్తూ.

"నీ బొంద ఇది అమెరికాకాదు ఇండియా, నువ్వు ప్రతిదాని విలువను రూపాయల్ని డాలర్స్‌లోకి మార్చుకుని చూస్కుని వెర్రి చీప్ అంటూ వాళ్ళముందే అఘోరించకు" అని సుందర్ చెవిలో కేకలేసి టాక్సి నూటఏభై రూపాయలకి బేరం అడాడు బుచ్చిబాబు.

ఇద్దరూ టాక్సి ఎక్కారు.

"అమెరికాలో ఇటుల బేరములు ఆసిన షూట్ చేయుదురు" అని సుందరం అంటూ ఉండగా టాక్సీ ముందుకు దూకింది. టాక్సీ బుచ్చిబాబు యింటిముందు ఆగింది. టాక్సీని పంపించి బుచ్చిబాబు సుందర్‌ని యింట్లోకి తీసుకెళ్లి హాల్లో వున్న తల్లిదండ్రులకు పరిచయం చేసాడు.

"నాన్నా....నేను చెప్పానే అమెరికాలోని నా చిన్నప్పటి ఫ్రెండ్ సుందరని.....ఇతనే"

"ఓ.......   అలాగా?" అన్నాడు పర్వతాలరావు.

"ఈయనే మా నాన్న పర్వతాలరావు" చెప్పాడు బుచ్చిబాబు .

అతని వాక్యం పూర్తికాకమునుపే సుందర్ పర్వతాలరావు మీదికి లంఘించి ఆయన్ని వడిసి పట్టుకుని రెండు బుగ్గలమీదా చుపుక్..... చుపుక్ అని ముద్దులు పెట్టేశాడు.

"ఏంటి బాబు ఈ వెధవ పని?" కంగారుగా వెనక్కి జరిగిపోయి బుగ్గలు తుడుచుకుంటూ అన్నాడు పర్వతాలరావు.

"ఇది అక్కడి ఆచారం నాన్నా మనం నమస్కారం అనుకోమూ? అలాగన్నమాట" అన్నాడు బుచ్చిబాబు.

"మంచి ఆచారమే " అన్నాడు పర్వతాలరావు.

"అమెరికాలో ముద్దులు పెట్టునప్పుడు వెనుకకు జరిగిన యడల షూట్ చేయుదురు" అన్నాడు సుందర్.

"షూట్ చేస్తారు -- పింజారీ వెధవల పీకలమీద కాలేసి తొక్కుతా!" అన్నాడు పర్వతాలరావు పళ్ళు కొరుకుతూ.

"అబ్బ..నిన్ను కాదులే నాన్నా అమెరికాలో విషయం గురించి చెపుతున్నాడు. ఒరేయ్ సుందర్ ఈవిడేమో మా అమ్మగారు పార్వతమ్మ " అని తల్లిని పరిచయం చేశాడు.

సుందర్ మూతి ముందుకు పెట్టి రెండడుగులు ముందుకు వేసాడు. పార్వతమ్మ రెండు చేతులతో చెంపలు మూస్కొని భయం భయంగా అడుగులు వెనక్కి వేసింది.

"ఒరేయ్ మా అమ్మకు మాత్రం నమస్కారం పెట్టు చాలు. మీ అమెరికాలో షూట్ చేస్తారుగానీ ఇక్కడ పరాయి ఆడాళ్ళని చుపుక్ చుపుక్ అని ముద్దులు పెడితే మందు పాతరలు పెట్టి పేల్చి చంపుతారు" అన్నాడు బుచ్చిబాబు సుందర్ భుజాలు పట్టి ఆపుతూ.

"ఓ..... వెరీ డేంజరస్!" అన్నాడు సుందర్ "అయితే ముద్దులు కాన్సిల్. నమస్కారమమ్మా పార్వతమ్మ " అన్నాడు.

పార్వతమ్మ తేలిగ్గా ఊపిరి పీల్చుకుని బుగ్గలమీద చేతులు తియ్యకుండానే నమస్కారం బాబూ!" అంది.

మధ్యాహ్నం భోజనాల దగ్గర...

"ఓ...... కూర షాలా కారముగా యున్నది. చారు షాలా పుల్లగా యున్నది, ఇది యేంటి? పప్పులో ఉప్పు ఎక్కువగా వున్నదే" అంటూ ప్రతి దానికి వంకలు పెట్టుకుంటూ తినసాగాడు సుందర్.

"ఇండియాలో ఇలా వంటలకి వంకలు పెడ్తూ తింటే టెంకి వాయగొడతారు" అంది చివరికి కసిగా.

" టెంకి? అనగా నేమి? " ఆడిగాడు సుందర్.

"దాని గురించి తర్వాత చెబుతాగానీ ముందు నువ్వు భోంచేయి" అన్నాడు బుచ్చిబాబు..

భోజనాలయ్యాక బుచ్చిబాబు, సుందర్ ఇద్దరూ మంచంమీద పడుకొని తమ చిన్ననాటి కబుర్లూ కాలేజీ కబుర్లూ సరదాగా చెప్పుకున్నారు. ఆ తర్వాత కాసేపు నిదరపోయి ట్యాంక్‌బండ్ దగ్గర బుద్ధపూర్ణిమ ప్రాజెక్టుకి వెళ్ళి ఒక సిమెంటు బెంచి మీద బైఠాయించారు.

కాస్సేపు ఆ కబుర్లూ ఈ కబుర్లూ మాట్లాడుకున్నాక బుచ్చిబాబు అన్నాడు "సరేగానీ....ఎల్లాగూ ఇండియాకి వచ్చావుకదా....ఇక్కడ ఓ మంచి అమ్మాయిని చూసి పెళ్లి చేసుకుని మీ అమెరికాకు తీసుకెళ్ళారాదుట్రా సుందర్?"

ఆ మాట వినగానే సుందర్ పకపకా అమెరికా స్టయిల్లో నవ్వాడు "పెళ్లి? యూ మీన్ మ్యారేజ్!? హో హో హో ?.... వాటె జోక్?"

"పెళ్ళంటే జోకంటావ్ సిల్లీగా....ఏరా .... నువ్వు మగాడివి కావా?"

"అషలైన షెట్ పర్షంట్ మగవారే పెండ్లి షెషుకోరు. నా సంగతి తర్వాత ముందు నీ షంగతి షెప్పుము" అన్నాడు సుందర్ బుచ్చిబాబు వీపు మిద గుద్దుతూ.

బుచ్చిబాబు బాధగా మూలిగి "ఇదిగో నువ్విలా గుద్దావంటే నిన్ను ఏదో ఓ హోటల్లో దించేసి నేను మా ఇంటికి పోతానంతే" అన్నాడు సీరియస్‌గా.

“ఓక్కే....ఓక్కే.....షెప్పుడు షెప్పుడు!” బుచ్చిబాబు భుజం తట్టాడు సుందర్. బుచ్చిబాబు సిగ్గుతో మెలికలు తిరుగుతూ “నా పెళ్ళి ఫిక్స్ అయిందిరా సుందర్.....ఈ నెలలో ఇరవయ్యో తారీఖున” అన్నాడు.

ఆ మాట వింటూనే సుందర్ బాధగా బుర్రకాయ్‌ని అడ్డంగా ఊపాడు.

“ఓ వెరీ వెరీ బ్యాడ్ న్యూస్ ” అన్నాడు.

బుచ్చిబాబు అయోమయంగా మొహం పెట్టాడు “అదేంట్రా ఎవరైయినా పెళ్ళి చేస్కుంటుంటే కంగ్రాట్స్ అని అంటారుగాని నువ్వేమో బ్యాడ్ న్యూస్ అంటావేంటి?”

“అటుల షెప్పినవాడు ఒట్టి సన్నాసి... పెండ్లి అనగా ఫ్రీడంను కోలుపోవుట ....ఎల్లప్పుడూ దెబ్బలాడుకొనుట....యెునో?” అన్నాడు సుందర్ పోనీ టెయిల్‌ని ఊగిస్తూ.

“కానీ మాది పెద్దలు కుదిర్చిన వివాహం కాదు. ప్రేమ వివాహం! మేమెందుకు దెబ్బలాడుకుంటాం?” పాయింటు లాగుతూ అన్నాడు బుచ్చిబాబు.

“హ హ హ .....లవ్?లవ్ అనగా ట్రాష్.....ఎచ్చటను పూర్ లవ్ లేదు. అమెరికాలో లవ్ షేస్కుని మ్యారేజ్ చేస్కుందురు. మళ్ళీ ఇద్దరూ విడిపోయి వేరే వాళ్లను ఇద్దరూ మళ్ళీ లవ్ మ్యారేజ్ షేస్కుందురు. మళ్ళీ విడిపోయి మళ్ళీ లవ్ మ్యారేజ్ షేస్కుందురు. ఇటుల జీవితములో ఒక్కొక్కరు ఏవరేజ్‌గా నాలుగైదు లవ్ మ్యారేజీలు షేస్కుందురు. అన్నియు లవ్ మ్యారేజీలే మరి ఎలా విడిపోదురు”.

“అది అమెరికాలో.....ఇండియా అలాక్కాదు. జీవితాంతం కలిసి ఉంటారు”.

“ప్రేమ లేకుండా కలసివుండుట ఎందులకు? తన్నుకుంటూ, తిట్టుకుంటూ జీవితాంతము కలిసి వుండుటకన్న వేరే వివాహము షేష్కని సుఖముగా నుండవచ్చునుకదా?”

“అలా చెస్తే జనము మొహాన ఉమ్మేస్తారు. ఈ సంఘము ఊర్కుంటుందా?” ఆవేశముగా అడిగాడు బుచ్చిబాబు.

సుందర్ గొల్లున నవ్వాడు “అయినచో ఎవరూ ఉమ్మివేయిని ఎడల షంఘము ఏమియూ అతని యడల మీరునూ విడిపోయి వేరు పెండ్లి షేసుకోందరు... అవునా మనషులో వున్నది ఒకటి బయట షేయినది ఒకటి....షేమ్!”

బుచ్చిబాబు ఖంగుతిని నీళ్ళు నమిలాడు “అంటే నా ఉద్దేశ్యం అది కాదనుకో....” అన్నాడు నసుగుతూ.

“ఏదికాదు. అమెరికాలో ఇటుల మనుషులో ఒకటి బయటికి ఒకటి మాట్లాడిన ఎడల షూట్ షేయుదురు. నిజము షెప్పాడు.. గుండుమీద షెయ్యి వేసుకుని షెప్పుము....”

“గుండు కాదు ....గుండె” సరిదిద్దాడు బుచ్చిబాబు.

“అదే...అదే... దానిమీద షెయ్యి వేష్కని షెప్పుము. ఇండియా నందు ఎంత మంది భార్యాభర్తలు షంపూర్ణ ఇష్టముతో కాపురము షేయదురు కొందురు వంష గౌరవం కొరకు కాపురము షేయుదురు. కొందరు పిల్లల కొరకు కాపురము షేయుదురు. మరికోందరు పరువు

మర్యాదల కొరకు కాపురము షేయుదురు. ఇంకా కొందరు షన్నాషులు ప్రక్క ఇంటివారి కొరకు కాపురము షేయుదురు. అంతేయేగానీ మొగుడు కొరకు పెండ్లాము, పెండ్లాము కొరకు మొగుడు కాపురము షేయునా?" ఆవేశముతో ఊగిపోతూ ప్రశ్నించాడు సుందర్.

అతని వాదనకి బుచ్చిబాబు మెత్తబడిపోయాడు "నువ్వు అన్నదాంట్లో కాస్త నిజము లేకపోలేదనుకొ" అన్నాడు.

"కొంషెము కాదు.. సెంట్ పర్సంట్ నిజము కలదు"

"కానీ మేము ఆ టైపులోకి రాము!"

"పెండ్లి షేసుకోనుటకు ముందు అందరు అటులనే అనుకొందురు. నువ్వు కూడా అంతే. మేము దెబ్బలాడుకొనెదము. తన్నుకొనెదము అని వివాహమునకు ముందు అనుకుని ఎవరూ వివాహము షేషుకొనరు కదా?"

"నాకిన్ని నీతులు సిల్లీగా చెప్తున్నావు కదా? మరి నువ్వు పెళ్ళి చేస్కోవా?" అడిగాడు బుచ్చిబాబు ఇప్పుడు దొరికావు... ఏంచేస్తావోచెప్పు అన్నట్లుగా చూస్తూ.

"నెవర్..నెను పెండ్లి ఏన్నటికీ షేషుకొనను!" పోనీటెయిల్ ఊగిస్తూ అన్నాడు సుందర్.

"అయితే జీవితాంతము ఇలా ఒంటరిగానే వుండిపోతావా?"

"అటుల నేను అనలేదు" నవ్వాడు సుందర్.

"మరి?" బుచ్చిబాబుకి అర్ధము కానట్టు చూశాడు.

"నేనూ నా ఫ్రండ్ జూలీ కలషి జీవిస్తున్నాము! మా ఇద్దరికీ ఆలోచనల యందు తేడాలు వచ్చిన మేము విడిపోదుము. సో....విడిపోవు వరకు ఆనందముగా, సుఖముగా కాపురము షేషుకొందుము. మేము స్నేహితులము కనుక ఒకరిని ఒకరు గౌరవించుకొనెదము పెండ్లి షేషుకుని మొగుడూ పెండ్లాములయిన ఒకరిమీద ఒకరికి గౌరవము వుండదు. తిట్టుకుని, కొట్టుకుని కలసి ఉందురు. అందువలన ఆమెరికా అమెరికానందు షాల మంది ఆడా, మగా స్నేహితులు కలసి ఉందురు అది షాలా మంచి పద్దతి నువ్వు కూడా అటులనే షేయుము!"

బుచ్చిబాబు మౌనంగా కూర్చున్నట్టు అతని మెదడులో ఆలోచనలు తిరుగుతున్నాయి.

పెళ్ళి అయిన తర్వాత సీతకి, తనకీ మధ్య ప్రేమ, ఆకర్షణ తగ్గిపోతాయ? ఇద్దరూ దెబ్బలాడుకుంటారా?"

"మనమింక ఇంటికి పోవుదము. రేపు నీ షీటని నాకు పరిచయము షేయుము!" అంటూ బెంచీ మీద నుండి లేచి నిలబడ్డాడు సుందర్. బుచ్చిబాబు కూడా లేచి నిలబడ్డాడు.

బుచ్చిబాబు ఇల్లు.

సమయం సాయంత్రము ఆరు గంటలైంది. సుందరం గోడ గడియారము వంక అసహనముగా చూసాడు "ఏది? నీది కాబోయే పెండలము ఇంకను రాలేదు?..... హె!" భుజాలు ఎగరేశాడు.

"వస్తుందిలే..అంత కంగారైతే ఎలా?" అతని ప్రక్కనే కూర్చునివున్న బుచ్చిబాబు

సమాధానము చెప్పాడు. ఇక్కడే హాల్లో కాస్త దూరముగ వెరే సోఫాలో పర్వతాలరావు పార్వతమ్మ కూర్చుని టీవీలో కార్యక్రమాన్ని చూస్తున్నారు.“ఇదే మా అమెరికలో అయితే షెప్పిన టైమ్‌కి రాకపోయినచో షూట్ చేయుదురు యూ నో?” అన్నాడు సుందరం.

“ఇంతకి నువ్వు అమెరికాలో ఎంతమంది వెధవల్ని షూట్ చేసావ్ నాయనా?” ఉండబట్టలేక అడిగాడు పర్వతాలరావు.

“అయినా జనాల్ని అలా ఇష్టము వచ్చినట్టు షూట్ చేసి చంపేస్తుంటే జైల్లో పెట్టరండీ పాపం?” అమాయకంగా అడిగింది పార్వతమ్మ.

“అచటి జనాలు షూట్ చేయు అవకాశము ఇవ్వరు....ఎవ్రీథింగ్ విత్ బి ఫర్‌పెక్ట్! హె!” భుజాలెగరేసాడు సుందరం.

ఇంతలో డోర్ బెల్ మోగింది. బుచ్చిబాబు ఒక్క ఉదుటున సోఫోలోంచి లేచాడు.

“సీత వచ్చినట్టు వుంది” అంటూ వీధి తలుపులు దగ్గరికి పెద్ద పెద్ద అంగలేస్కుంటూ నడిచాడు. సుందరంకు తన సీతని చూపించి పరిచయం చేయాలని ఆమెని ఆఫీసు నుండి డైరెక్టుగా ఇంటికి రమ్మని ఫోన్ చేసి చెప్పాడు బుచ్చిబాబు.

వీధి తలుపు గడియ తీశాడు.

ఎదురుగా సీత

“ఆలస్యము అయిందా?” అడిగింది సీత!

“లేదులే..పద నిన్ను చూడాలని నా ఫ్రెండ్ చాలా ఆతృతగా ఎదురు చూస్తున్నాడు” అన్నాడు బుచ్చిబాబు సీత భుజం మీద చెయ్యి వేస్తూ.

ఇద్దరూ హాల్లోకి వచ్చారు.

“ సీతా.......ఇదిగో వీడే నా క్లోజ్ ఫ్రెండ్ సుందర్! సుందర్ *ఈ*మె సీత” పరిచయం చేసాడు బుచ్చిబాబు. సీత సుందర్‌కు నమస్కారము చేసింది.

సుందర్ నమస్కారము పెట్టలేదు. కానీ సోఫాలోంచి గబుక్కున లేచి మూతి ముందుకు పెట్టి సీతవైపు అడుగులు వేసాడు. అతని ఉద్దేశ్యం గమనించి బుచ్చిబాబు కంగారు పడిపోయాడు.